సాక్షి శ్రీకాకుళం

ఆదివారం | 30 | ఏప్రిల్ | 2023



మెయిన్స్‌లో మెరిశారు

జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థులు మెరిశారు. మంచి ర్యాంకులు సాధించారు.

- 6లో



కన్యాకుమారి చిత్రీకరణ

జిల్లా కేంద్రంలో కన్యాకుమారి సినిమా షూటింగ్ జరిగింది. చిత్రీకరణను పూర్తి చేశారు.

- 6లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	25°
ఇచ్ఛాపురం	35°	24°
పాతపట్నం	35°	26°
శ్రీకాకుళం	34°	24°

న్యూస్‌రీల్

న్యాయబంధుపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయబంధుపై అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయబంధు టెలీలా, ఏడీఆర్ మీడియేషన్ అండ్ కన్సీలియేషన్ అంశంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమయంలో కేసులు పెరుగుతున్న కారణంగా మీడియేషన్ అవసరం ఉందని ఆయన తెలిపారు. న్యాయపరిధిలో ఈ మీడియేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.శ్రీదేవి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమైన వేళ..

- శ్రీకాకుళంలో లబ్ధిదారులకు టిడ్కో గృహాల అందజేత
- నిర్మాణంలో మరో 12వేల గృహాలు : మంత్రి ధర్మాన
- పేదవారి సొంతింటి కల నెరవేరింది: మంత్రి సురేష్



లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందిస్తున్న మంత్రులు ధర్మాన, సురేష్, కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్

శ్రీకాకుళం రూరల్:

ఏపీ టిడ్కో గృహాల నిర్మాణంలో జిల్లా రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో ఉందని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం సమీపంలోని పాత్రునివలసలోని నిర్మించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన-వైఎస్సార్ జగనన్న ఇళ్లు ఏపీ టిడ్కో గృహ సముదాయం ప్రారంభోత్సవంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. పాత్రునివలసలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. శ్రీకాకుళం కార్పొరేషన్ విలీన గ్రామాలైన పెదపాడు, పాత్రునివలస, చాపురం, కిల్లిపాలెం, గ్రామాలకు సైతం ఒక పెద్ద ప్రాజెక్టు ఏర్పాటు చేసే దిశగా 24 గంటలు నీరు, విద్యుత్ అందేలా ప్రణాళికలు తయారు చేయాలని ధర్మాన అధికారులకు ఆదేశించారు. అలాగే పాత్రునివలస, పెదపాడు గ్రామాల్లో మరో 12వేల ఇళ్లు నిర్మిస్తామన్నారు. పాత్రునివలసలో 1280 టిడ్కో ఇళ్లను రూ.105.62 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు.

పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ పాత్రునివలసలోని 40 బ్లాకులతో మొత్తంగా 1280 ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. గృహాలను పూర్తి స్థాయిలో నిర్మించి, మురుగునీరు శుభ్రం చేసే యంత్రంతో పాటు 5లక్షల లీటర్ల కెపాసిటీ గల నీళ్ల ట్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో మహిళా మార్ట్‌లతో పాటు సచివాలయం, హెల్త్‌సెంటర్, పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 2024లో ప్రజలంతా కలిసి మా నమ్మకం నువ్వే జగన్ అనేలా మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు.

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పాత్రునివలసలో నిర్మించిన టిడ్కో ఇళ్లను చూసేందుకు పదిసార్లు విజిట్ చేశానని తెలిపారు. 24 పట్టణాల్లో టిడ్కో ఇళ్లు పూర్తి చేయగా 25వ పట్టణంగా శ్రీకాకుళం నిలిచిందన్నారు. రూ.16కోట్లు వెచ్చించి నాగావళి నుంచి ఐదున్నర కిలోమీటర్ల వరకూ పైపులైన్‌తో 24/7 తాగునీటిని అందిచనున్నట్లు తెలిపారు.

టిడ్కో ఎండీ చెరుకూరు శ్రీధర్ మాట్లాడుతూ వంద శాతం మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో పాత్రునివలస టిడ్కో కాలనీ నిలిచిందన్నారు. 30 లక్షల మందికి పట్టాలు అందిస్తూ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం ఈ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ 1280 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు మంత్రులు చేతులు మీదుగా టిడ్కో ఇళ్ల పట్టాలను, ఇంటి తాళాలను అందజేశారు.

మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్లు ఎంవీ పద్మావతి, పైడిశెట్టి జయంతి, మాజీ సర్పంచ్ గాంధీ మాట్లాడారు. అలాగే మెప్మా పీడీ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ గణపతిరావు, టిడ్కో అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులతో పూజ చేస్తున్న దృశ్యం

జగనన్నకు రుణపడి ఉంటాం



వైఎస్సార్ మాకు ఆరాధ్య దైవం. ఇప్పుడు ఆయన ఫొటో పక్కన వైఎస్ జగన్ ఫొటో పెట్టుకుంటాం. సీఎం రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. నా భర్త కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. ఒక్క రూపాయితో లక్షలు విలువ చేసే ఒక ఇల్లు మా సొంతమైంది. ఆ అనుభూతి మాటల్లో చెప్పలేకపోతున్నాం. - చిట్టూరు లక్ష్మి (బలగ)



హాజరైన లబ్ధిదారులు

క్లుప్తంగా

డిగ్రీ స్పాట్ రెమ్యూనరేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల మూల్యాంకన రెమ్యూనరేషన్‌ను విడుదల చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. మొదటి, రెండు, మూడు, నాలుగు సెమిస్టర్లకు సంబంధించి రూ.30.49 లక్షలు విడుదలైనట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం గాయత్రి సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో మూల్యాంకన శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు.

180 మద్యం బాటిళ్ల స్వాధీనం

సంతబొమ్మాళి: పాలేశ్వరస్వామి జంక్షన్ వద్ద 180 మద్యం బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూధనరావు తెలిపారు. ఎం.సున్నాపల్లి గ్రామానికి చెందిన అర్జాల ఈశ్వరరావు వివిధ మద్యం షాపుల నుంచి 180 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామం తరలించాలనే ప్రయత్నంలో ఉన్నారు. పోలీసులకు సమాచారం రావడంతో నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మెయిన్స్‌లో మెరిశారు

- జేఈఈలో సత్తాచాటిన సిక్కోలు విద్యార్థులు
- అత్యుత్తమ పర్సంటైల్, ర్యాంకుల సాధన


సనపల అనిరుధ్ (122)


మార్పు జగన్‌మోహన్ (1170)


కందుల జోజికుమార్ (1855)


సుగ్గు ప్రేమ్‌కుమార్ (2571)


ఎం.వి.సాయి హర్షవర్ధన్ (211)


హనుమంతు నితిన్ (743)


సుంకర రోహిత్ (3155)


వద్దాది సంప్రీత్ (3986)


తిప్పాన లిఖితా రెడ్డి (4552)


దేవిప్రసాద్ (10995)


వి.సీతంనాయుడు (3003)


వై.భరత్ (1110)

శ్రీకాకుళం న్యూకాలనీ:

జేఈఈ మెయిన్స్‌లో సిక్కోలు విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల పలు విడతలుగా జరిగిన జేఈఈ మెయిన్స్ ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో నందిగాం మండలం దిమిలాడకు చెందిన సనపల అనిరుధ్ ఆల్ ఇండియా స్థాయిలో 122వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 25వ ర్యాంకు సాధించాడు. తండ్రి ఖగేశ్వరరావు విశాఖపట్నం పోర్ట్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తుండగా, తల్లి ఝాన్సీ గృహిణి. అలాగే పెద్దలవునిపల్లికి చెందిన మార్పు జగన్‌మోహన్ ఆల్ ఇండియా స్థాయిలో 1170వ ర్యాంకు సాధించాడు. తండ్రి ధర్మారావు తెలంగాణలో ఏపీఎస్ ఆర్టీసీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి విశాలక్ష్మమ్మ గృహిణి. శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న కందుల జోజికుమార్ 99.848 పర్సంటైల్‌తో ఆలిండియా కేటగిరీలో 1855వ ర్యాంకు సాధించాడు. చిన్నబరాటం వీధికి చెందిన సుంకర రోహిత్ 3155వ ర్యాంకు, కత్తెరవీధిలో నివాసం ఉంటున్న వద్దాది సంప్రీత్ 3986వ ర్యాంకు, పాతనౌపడ పరిధిలోని జెండాపేటకు చెందిన తిప్పాన లిఖితారెడ్డి 4552వ ర్యాంకు, శ్రీకాకుళం నగరానికి చెందిన కొఠారి భవేష్ భార్గవ్ 8183వ ర్యాంకు, దేవాన్ష్ నాయక్ 17441వ ర్యాంకు, జీఎంఎస్ గణపతి 18576వ సాధించి జాతీయస్థాయిలో రాణించారు. వీరంతా శ్రీకాకుళం శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లో చదువుతున్నారు. అలాగే నారాయణ కళాశాల నుంచి ఎం.వి.వెంకట హర్షవర్ధన్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 211వ ర్యాంకు, హనుమంతు నితిన్ 743వ ర్యాంకు, వై.భరత్ 1110, వడ్డిపల్లి సీతంనాయుడు 3003, పాలిశెట్టి గణేష్ ఆదిత్య 7284, ఎన్.సుమంత్ 7398వ ర్యాంకు సాధించారు.

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి గ్రామానికి చెందిన సుగ్గు ప్రేమ్‌కుమార్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 2571 ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 467వ ర్యాంకు సాధించాడు. తండ్రి పితంబర్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

టెక్కలి: పాతనౌపడ పంచాయతీ జెండాపేటకు తిప్పాన లిఖితా రెడ్డి 99.61 మార్కులతో ఓబీసీ కేటగిరిలో 902వ ర్యాంకు, ఆలిండియా కేటగిరీలో 4552 ర్యాంకు సాధించింది. తండ్రి హరి రెడ్డి ఏపీ జెన్‌కోలో ఈఈగా పనిచేస్తున్నారు. తల్లి పద్మావతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

సంతబొమ్మాళి: కాశీపురం గ్రామానికి చెందిన లింగూరు దేవిప్రసాద్ ఆల్ ఇండియా కేటరిగీలో 10,995వ ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 2468 ర్యాంక్ సాధించాడు. తండ్రి అప్పలస్వామి విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి, తల్లీ కుమారి గృహిణి.

టాప్ ఐఐటీలో చేరడమే లక్ష్యంగా..

జేఈఈ మెయిన్స్‌లో 99.848 పర్సంటైల్‌తో ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. అమ్మనాన్న, లెక్చరర్స్ చాలా ప్రోత్సహించారు. జేఈఈ అడ్వాన్స్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధమౌతున్నాను. ఉత్తమ ర్యాంకు దక్కించుకోవడంతోపాటు టాప్ ఐఐటీలో చేరి సీఎస్ఈ కంప్యూటర్ సైన్స్ చేస్తాను. నాన్నశివశంకర్ సాక్షి బ్యూరో చీఫ్, అమ్మ సంతోషి గృహిణి.

– కందుల జోజికుమార్, జేఈఈ మెయిన్స్ ఆలిండియా 1855వ ర్యాంక్, శ్రీకాకుళం

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

జేఈఈ మెయిన్స్ 99.73 పర్సంటైల్ ఉత్తీర్ణత సాధించాను. అడ్వాన్స్‌కు బాగా ప్రిపేర్ అవుతున్నాను. ముంబై ఐఐటీలో సీఎస్ఈ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీ ర్‌ని కావడమే లక్ష్యం. నాన్న సుంకరి రమణమూర్తి సివి ల్ సప్లయ్ ఉద్యోగి, అమ్మ మంజుల ఎస్‌జీటీ టీచర్.

– సుంకర రోహిత్, జేఈఈ మెయిన్స్ ఆలిండియా 3155వ ర్యాంక్

అడ్వాన్స్‌లోనూ సత్తాచాటుతా..

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదివా. అడ్వాన్స్‌లోనూ సత్తాచాటి మంచి ర్యాంకు సాధిస్తా. నాన్న శ్రీనివాసరావు చిన్న కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. అమ్మ రాజ్యలక్ష్మి గృహిణి.

– వద్దాది సంప్రీత్, జేఈఈ మెయిన్స్ ఆలిండియా 3986వ ర్యాంక్

టెక్కలి: పాతనౌపడ పంచాయతీ జెండాపేట గ్రామానికి చెందిన దల్లి మణిదీప్ 99.01 మార్కులతో ఓబీసీ కేటగిరిలో 2618వ ర్యాంక్ ఆలిండియా కేటగిరీలో 11,575వ ర్యాంకు సాధించాడు. కుమారుడికి ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు గణేశ్వరరావు, స్నేహలత హర్షం వ్యక్తం చేశారు.

కన్యాకుమారి సినిమా చిత్రీకరణ పూర్తి


హీరోయిన్‌కు సీన్ వివరిస్తున్న డైరెక్టర్ దామోదర్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో పదిరోజులుగా రాడికల్స్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'కన్యాకుమారి' సినిమా చిత్రీకరణ పూర్తయిందని చిత్ర దర్శకుడు దామోదర్ తెలిపారు. హ్యాపీ షాపింగ్ మాల్, మహిళా కళాశాల, కుందువానిపేట బీచ్ తదితర ప్రాంతాల్లో సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే యువతీ, యువకుల ప్రేమకథా, హాస్య ప్రధానంగా చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం యాసలో సంభాషణలు ఉంటాయని, త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చెప్పారు. శ్రీచరణ్, గీతాషైనీ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం సాహిత్య సాగర్, కెమెరా శివ గాజుల, సహ నిర్మాతలు సతీష్‌రెడ్డి, వరీనియా మామిడి, సిద్ధార్థ్ అని తెలిపారు. గతంలో ఆనంద్ దేవరకొండ హీరోగా 'పుష్పకవిమానం' నిర్మించామని, ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందని, ఈ చిత్రాన్ని ఆశీర్వదించాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,930–00
బంగారం(22సి. 10గ్రా.)	55,850–00
వెండి (కిలో)	80,400–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు

- మెగా పీపుల్స్ సర్వేలో తిరుగులేని నాయకుడిగా వైఎస్ జగన్
- ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు చేసే అర్హత టీడీపీకి లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



సర్వే బుక్స్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, తదితరులు

నరసన్నపేట: సంక్షేమ పథకాలతో ప్రజా నాయకుడిగా కీర్తి పొందుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రజల మద్దతు సంపూర్ణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే ఉందని స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతమైందని తెలిపారు. మెజారిటీ కుటుంబాలు ప్రభుత్వ పనితీరుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు మెగా పీపుల్స్ సర్వేలో తేలిందన్నారు. మాయ మాటలు, కుతంత్రాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్న టీడీపీ నాయకుల ఆశలు నెరవేరబోవని అన్నారు. 14 ఏళ్ల పాలన చేపట్టిన టీడీపీ ప్రతి పనిలోనూ స్వార్థమే తప్ప ప్రజా సంక్షేమం చూడలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలే కాకుండా మరెన్నో పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. జాతీయ పార్టీగా చెప్పుకుంటున్న టీడీపీ ఏపీలో 175 స్థానాల్లో పోటీ చేయగలదా అని సూటిగా ప్రశ్నించారు. ఎన్టీఆర్ జయంత్యుత్సవాలు చేసే అర్హత టీడీపీకి లేదని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తో పాటు జలుమూరు ఎంపీపీ వాన గోపి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు తదితరులు ఉన్నారు. అనంతరం ఇంటింటి సర్వే చేపట్టిన బుక్స్‌ను చూపించారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జేసీ ఎం.నవీన్ వైద్యాధికారులను కోరారు. ఆరోగ్యశ్రీ సేవలు, పాటించాల్సిన అంశాలపై ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బయోమెట్రిక్ తప్పకుండా అమలు చేయాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన యాప్‌లను విధిగా వినియోగించాలన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త పి.ప్రకాశరావు మాట్లాడుతూ బయోమెట్రిక్ ద్వారానే మిత్రాలకు ఆసరా చెల్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు. మే 1వ తేదీ నుంచి ప్రతి మిత్రా కూడా ఆస్పత్రుల్లో బెడ్ మీద ఉన్న పేషెంట్ వద్దకు వెళ్లి ఫొటోను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

స్పీకర్‌ను కలిసిన మంత్రి ఆదిమూలపు సురేష్


స్పీకర్ తమ్మినేనికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఆమదాలవలస : రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం ఆమదాలవలసలో శాసన సభాపతి తమ్మినేని సీతారాంను కలిశారు. ముందుగా మంత్రికి స్పీకర్ స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు చెందిన పలు సమస్యలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, నాయకులు పొన్నాడ చిన్నారావు, మామిడి రమేష్, జె.కె.వెంకటేశ్వరరావు, పాదిలాపు తిరుపతి, సంపత్‌రావు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెగా పీపుల్స్ సర్వేతో ప్రతిపక్షాల్లో వణుకు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్


ప్రజాదరణను వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: ఇటీవల నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మెగా పీపుల్స్ సర్వేకు అత్యంత ప్రజాదరణ రావడంతో ప్రతిపక్షాలకు మతిపోయిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శనివారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేషంగా ప్రజా మద్దతు లభించిందన్నారు. దీంతో ప్రతిపక్షాలు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నాయని చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏనాడైనా కింజరాపు కుటుంబానికి చెందిన ఎర్రన్నాయుడు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు టెక్కలి నియోజకవర్గంలో పేదల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారా.. అని దువ్వాడ ప్రశ్నించారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎంపీ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవడంతో సుమారు రూ.18 కోట్లు వెనక్కి మళ్లిపోయాయని గుర్తు చేశా రు. టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.6500 కోట్ల కేటాయించడం ఆయన సంక్షేమ పాలనకు నిదర్శమన్నారు. సుమా రు రూ.4362 కోట్లతో మూలపేట పోర్టు, రూ. 852.45 కోట్లతో ఆఫ్‌షోర్ పనులు, రూ.1500 కోట్ల మేర సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైనాట్ 175 టార్గెట్‌ను కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. సమావేశంలో టెక్కలి ఎంపీపీ ఎ.సరోజన మ్మ, కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బి.మురళీ, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు ఎస్.మోహన్, జె.జయరాం, టి.బలరాం, జి.నాగభూష ణరావు, టి.ఫల్గుణరావు, కె.అప్పన్న, జి.కేశవరావు, బి.తులసీరావు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు బాధ్యత ప్రిన్సిపాల్స్‌దే

- కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్

టెక్కలి: విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్స్‌దేనని కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. జోన్–1 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్లతో శనివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నిర్వహణతో పాటు అకడమిక్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెబితే కచ్చితంగా కళాశాలకు వస్తారని చెప్పారు. కేవలం జీతం వస్తే చాలు అనే ధోరణి విడనాడాలన్నారు. విద్యార్థులుగా ఉన్న కాలంలో తమ అధ్యాపకులు ఏ విధంగా ఉండాలి అని భావించారో...అధ్యాపకులు కాగానే వారిలో మార్పులను ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రతి కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో జోన్–1 ఆర్‌జేడీ శోభారాణి, నాక్ సీసీఈ కె.విజయ్‌బాబు, కమిషనర్ కార్యాలయం సిబ్బంది డి.శంకరరావు, స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.